

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

అర నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- ఉమ్మడి జిల్లా అభ్యర్థుల కోసం 12 పరీక్షా కేంద్రాలు
- డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- మొత్తం పోస్టులు 1,139, అభ్యర్థులు 57,895

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి డీఎస్సీ రాత పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 7, 15 తేదీల్లో మినహా నెలాఖరు వరకూ ప్రతి రోజు రెండుపూటలా పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలి. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి ప్రతి అభ్యర్థి పరీక్షహాలులో ఉండాలి. అర నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలకు అనుమతించరు.



ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 1,139 పోస్టులకు 57,895 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న పరీక్షలకు మొత్తం 12 (కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, పెదగంట్యాడలో ఎస్‌వీఎస్ టెక్నాలజీ సొల్యూషన్స్, షీలానగర్, చినముషిడివాడల్లో ఐయాన్ డిజిటల్స్, ఎన్ఎస్‌టీఎల్ సమీపాన గల ఏడీజడ్ ఆర్వీనా డిజిటల్, మధురవాడ, రుషికొండల్లోని గాయత్రి విద్యాపరిషత్, దువ్వాడ, కాపుజగ్గరాజుపేటల్లో విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలు, శొంఠ్యాంలో ఎన్ఎస్ఆర్ఐటీ, నరవలోని విట్స్) కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష 1,940 మంది అభ్యర్థులు రాస్తారు. ప్రిన్సిపాల్, పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు మూడు గంటలు, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 2.30 గంటలు, ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్షకు 1.30 గంటల సమయం కేటాయించారు. దీంతో కొన్ని పరీక్షలు ఉదయం 9 గంటలు, మరికొన్ని 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం సెషన్‌లో 2 గంటలు, 2.30 గంటలకు మొదలవుతాయి. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష మాత్రం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారు. పరీక్షలు సజావుగా నిర్వహణకు ప్రతి కేంద్రానికి ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించారు. డైట్ ప్రిన్సిపాల్ (ఫోన్ నంబరు 9949993730) ఆధ్వర్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటుచేశారు. పరీక్షల నిర్వహణను విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించనున్నారు. గురువారం డిపార్టుమెంటల్ అధికారులతో డీఈఓ సమావేశమై పలు సూచనలు చేశారు. పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి, ఇతరత్రా సాయం కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ (9849739920, 9177292969, 8328525861) ఏర్పాటుచేసినట్టు డీఈవో తెలిపారు. అభ్యర్థులు ముందుగా కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.

చోడవరం రోడ్లు ఛిద్రం

- భారీ గోతులతో వాహనదారుల ఇక్కట్లు - 8లో

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

- జిల్లాలో 32 మంది ఎంపిక

అనకాపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించి ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదివి, ఉత్తమ ఫలితాలు సాధించిన 32 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ప్రతిభా నగదు పురస్కారాలకు ఎంపిక చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి విద్యార్థికి రూ.20 వేల నగదు



బుద్ద నవ్యశ్రీ (చోడవరం)



పి.సుప్రియ (అచ్యుతాపురం)

ప్రోత్సాహక బహుమతి అందజేయనున్నది. జిల్లా నుంచి ఎంపికైన వారు.. బుద్ద నవ్యశ్రీ (చోడవరం), బొజ్జ కిరణ్‌దీప్తి (నర్సీపట్నం)

... మిగతా 8వ పేజీలో

ఘనంగా పర్యావరణ దినోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని రహదారుల పక్కన, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల ఆవరణలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్, పాలిథిన్‌తో చేసిన వస్తువులను వినియోగించవద్దని కోరారు.



నక్కపల్లి మండలం పెదబోదిగల్లం వద్ద మొక్క నాటి నీరు పోస్తున్న పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్

పారిశ్రామిక ప్రగతికి బాటలు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు

- యూనిట్ల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం
- అనకాపల్లి, అచ్యుతాపురం మండలాల్లో ఇప్పటికే ఏర్పాటు
- మిగిలిన నియోజకవర్గాల్లో భూములు కేటాయింపు
- త్వరలో పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ వెల్లడి



అచ్యుతాపురం మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు



అనకాపల్లి మండలం కోడూరులో అభివృద్ధి చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి బాటలు పడుతున్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నది. ఇందులో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కులను అభివృద్ధి చేసి, వీటిల్లో యూనిట్ల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించనున్నది. అనకాపల్లి మండలం కోడూరు, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల పరిధిలోని ప్రత్యేక ఆర్థిక మండలిలో ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు నాయుడు గత నెలలో వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి తెలిసిందే. బుధవారం సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో జిల్లాలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు మోద ముద్ర వేశారు. దీంతో నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అధికారులు చకచకా పావులు కదుపుతున్నారు.

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అనకాపల్లి మండలం కోడూరులో 39.38 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం కేటాయించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో నాతవరం మండలం శృంగవరం గ్రామంలో ... మిగతా 8వ పేజీలో

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



ప్రతి ఇంటిలో కనీసం ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలి. దీంతోపాటు స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నది. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి. ఎంఎస్ఎంఈల ఏర్పాటు ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను పోత్సహించాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. జిల్లాలో అనకాపల్లి, అచ్యుతాపురం మండలాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను సిద్ధం చేశాం. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

కె.విజయకృష్ణన్, కలెక్టర్


పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

కోటవురట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

రైతులు దీర్ఘకాలిక ఆదాయం పొందేందుకు ఉద్యాన పంటల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుతోపాటు ఇంతవరకు సాగులో లేని బంజరు భూములు వున్న చిన్న, సన్నకారు రైతులకు అవకాశం కల్పిస్తున్నది. వివిధ రకాల పండ్ల తోటలతోపాటు చింత, కొబ్బరి, మునగ, ఆయిల్‌పామ్ వంటి పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నది.

ఉపాధి హామీ పథకంతో అనుసంధానం

- జాబ్ కార్డుతోపాటు సొంత భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు
- మూడేళ్లపాటు ఆర్థిక సాయం



ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రజలు వివిధ రకాల పండ్లను వినియోగించడం రానురాను పెరుగుతున్నది. దీంతో ఆయా రకాల పండ్లకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. డిమాండ్‌కు తగినట్టు సరఫరా లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. దీంతో పలువురు రైతులు కొత్తగా పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. పండ్ల తోటల పెంపకం ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందే అవకాశం వుండడంతో చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అనకాపల్లి జిల్లాలో రెండు వేల ఎకరాల బీడు భూముల్లో పండ్ల తోటల సాగు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు వున్న చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కనీసం 25 సెంట్ల భూమి వుండాలి. గరిష్ఠ పరిమితి మూడు ఎకరాలు. సాగునీటి సదుపాయం వుండాలి. మొక్కల పెంపకానికి వంద రోజులపాటు పనిదినాలు కల్పిస్తారు. ఉద్యాన శాఖ అధికారులు సూచించిన 20 రకాల్లో రైతులు తమకు నచ్చిన రకాన్ని సాగు చేసుకోవచ్చు. ఈ జాబితాలో మామిడి, చింత, కొబ్బరి, నేరేడు, మునగ, నిమ్మ, పనస, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, కివి, జామ, తైవాన్ జామ, సపోటా, జీడిమామిడి, దానిమ్మ, ఆయిల్‌పామ్ వంటివి వున్నాయి. ఆయిల్‌పామ్ మినహా మిగిలిన మొక్కలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మొక్కలు నాటినప్పటి నుంచి మూడేళ్లపాటు 13 రకాలు ఖర్చులను చెల్లిస్తుంది. మొక్కలు నాటిన తరువాత చెట్లుగా ఎదిగే వరకు అంతర పంటను సాగు చేసుకోవచ్చు. ఈ ఏడాది రెండు వేల ఎకరాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా ఇంతవరకు 1,134 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయడానికి రైతులు ముందుకు వచ్చినట్టు సమాచారం. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు ఎంపీడీవో కార్యాలయాల్లో ఉపాధి హామీ పథకం సిబ్బందిని సంప్రదించాల్సి వుంటుంది.

క్షయ రహిత సమాజం దిశగా..

'టీబీ ముక్తి భారత్' పేరుతో ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక

- రంగంలోకి ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు
- ఇంటింటికీ వెళ్లి అనుమానితుల నమూనాల సేకరణ
- ఆర్టీపీసీఆర్ సెంటర్లలో నిర్ధారణ పరీక్షలు
- పాజిటివ్ వస్తే ఆరు నెలలపాటు ఉచితంగా మందులు
- పౌష్టికాహారం కోసం నెలకు రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం
- జిల్లాలో ప్రస్తుతం 1,309 మంది క్షయ బాధితులు

నర్సీపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

క్షయ వ్యాధిని పారదోలడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. 'టీబీ ముక్తి భారత్' నినాదంతో ఈ వ్యాధి నుంచి ప్రజలను విముక్తి చేయడానికి వైద్య, ఆరోగ్య శాఖ పలు చర్యలు చేపట్టింది. వంద రోజుల్లో అన్ని ఇళ్లకు వెళ్లి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి వైద్య సిబ్బందిని రంగంలోకి దించారు.



ఆర్‌టీపీసీఆర్ సెంటర్‌లో కఫం నమూనా పరీక్షిస్తున్న సిబ్బంది

క్షయ వ్యాధి ప్రమాదకరంగా మారింది. క్షయ వ్యాధిగ్రస్థులు దగ్గినప్పుడు వారి నోటి నుంచి వెలువడే తుంపర్ల కారణంగా ఇతరుకు వ్యాపిస్తుంది. ప్రస్తుతం జిల్లాలో 1,309 మంది క్షయ బాధితులు ఉన్నారు. నర్సీపట్నం, అనకాపల్లి, అచ్యుతాపురం, కోటవురట్ల, ఎలమంచిలి, నక్కపల్లి, చోడవరం, కేజేపురం, కె.కోటపాడుల్లోని ప్రభుత్వ టీబీ కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు. నర్సీపట్నం ఆర్టీపీసీఆర్ సెంటర్‌లో నెలకు 350 నుంచి 400 మందికి కఫం పరీక్షలు నిర్వహిస్తుంటే వీరిలో 20 నుంచి 25 మందికి పాజిటివ్ వస్తున్నది. క్షయ వ్యాధి నుంచి ప్రజలకు విముక్తి కలిగించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. 'టీబీ ముక్తి భారత్' నినాదంతో క్షయ గురించి ప్రజలకు అవగాహన, ఉపసమనం కలిగించడానికి వైద్య, ఆరోగ్య శాఖ రంగంలోకి దిగింది. 'వంద రోజుల' లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను బుధవారం రంగంలోకి దించింది. ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి ఎక్కువ రోజులు దగ్గుతో బాధపడుతున్న వారి నుంచి కఫం నమూనాలు సేకరిస్తున్నారు. మద్యం, ధూమపాన అలవాటు వున్నవారు, మధుమేహం, కిడ్నీ సంబంధ వ్యాధి, హెచ్ఐవీతో బాధపడుతున్న వ్యక్తులు, పోషకాహారం లోపతో బాధపడుతున్న వారు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, క్షయకు మందులు వాడినయమైన వారు, వారి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్షయ నిర్ధారణ అయితే ఆరు నెలలకు సరిపడ మందును ఉచితంగా ఇస్తారు. అంతేకాక క్షయ పోషణ పథకం కింద ప్రతి నెలా రూ.1,000లను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. క్షయ నివారణ మందులను క్రమం తప్పకుండా వాడేలా ఆశా వర్కర్లు ... మిగతా 8వ పేజీలో

వాణిజ్య సరళిలో మునగ సాగు

డ్వాక్రా సంఘాల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం ప్రణాళిక

- ఔషధ గుణాలు ఉండడంతో మునగ పొడికి డిమాండ్
- పైలట్ ప్రాజెక్టు కింద గొలుగొండ, బుచ్చెయ్యపేట మండలాలు ఎంపిక
- ఒక్కో మండలంలో వంద ఎకరాల్లో సాగు
- విత్తనం సరఫరా, ఎండు ఆకు కొనుగోలుకు తమిళనాడుకు చెందిన కంపెనీతో టై అప్

గొలుగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

మునగ ఆకులో అత్యధిక పోషక విలువలు, ఔషధ గుణాలు వుండడంతో కొంతకాలం నుంచి మునగ ఆకులు, పొడి వినియోగం పెరుగుతున్నది. పలువురు మునగ తోటలను పెంచుతూ అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. దీంతో డ్వాక్రా సంఘాల ద్వారా మునగ సాగు చేయించి, వారిని ఆర్థికంగా బలోపేతం ... మిగతా 8వ పేజీలో



మునగ ఆకు

బల్క్‌డ్రగ్ పార్కు ప్రాంతంలో పరిశ్రమల కార్యదర్శి పర్యటన

- కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి పనులు పరిశీలించిన యువరాజ్

నక్కపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు కానున్న రాజయ్యపేట, పెదతీనార్ల, కాగిత గ్రామాల్లో గురువారం పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ పర్యటించారు. బల్క్‌డ్రగ్ పార్కు కోసం రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పలు నిర్మాణ పనులను పరిశీలించారు. పెదతీనార్లలో కొన్ని భూములను పరిశీలించారు. అవసరమైతే అదనంగా భూములు సేకరించడానికి స్థానిక అధికారులను ఆరా తీశారు. ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ నరసింహమూర్తితో మాట్లాడారు. భూములకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. రాజయ్యపేట నుంచి అమలాపురం మీదుగా కాగిత గ్రామం వద్ద జాతీయ రహదారి వరకు నిర్మిస్తున్న విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నూతన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు సంబంధించి అవసరమైన భూములతోపాటు, మరికొంత భూమిని సిద్ధంగా వుంచుకోవాలని అధికారులను ఆదేశించారు.



బల్క్‌డ్రగ్ పార్కు భూముల మ్యాపును పరిశీలిస్తున్న పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, కలెక్టర్ విజయ్‌కృష్ణన్

నాటిన మొక్కలను కాపాడుకోవాలి : కలెక్టర్ విజయ కృష్ణన్


ఎస్.రాయవరం: వమ్మవరంలోని రైతు కొబ్బరి తోటలో మొక్క నాటి నీరు పోస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్


ఎలమంచిలి కోర్టు సముదాయంలో మొక్కలు నాటిన ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి. స్పందన, న్యాయవాదులు, తదితరులు


అచ్యుతాపురం గురుకుల పాఠశాలలో మొక్కని నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, అధికారులు

ఎస్.రాయవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో నాటిన మొక్కలన్నింటిపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని పెనుగొల్లు, వమ్మవరం గ్రామాల్లో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని, అప్పుడే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా అంతర పంటలుగా కోకో పండిస్తే అదనంగా ఆదాయం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కోతుల బెడద ఎక్కువగా ఉందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దానికి ఆమె స్పందిస్తూ నాలుగైదు గ్రామాలకు కలిపి ఎక్కడైన ప్రభుత్వ భూమిలో కోతుల ఆహార నిమిత్తం మొక్కలు నాటి వాటికోసం అడవుల పెంపకాన్ని చేపట్టడం ద్వారా సమస్య తగ్గించవచ్చని సూచించారు. ఇందుకు తన వంతు సహాయం అందిస్తామని విజయ కృష్ణన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, డ్వామా పీడీ పూర్ణిమదేవి, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో సౌజన్య, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కొమ్మాయి గుండం వద్ద ఆయన మొక్కలు నాటారు. అదే విధంగా కోర్టు సముదాయం వద్ద ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జీ స్పందన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు ఎల్వీ రామకృష్ణారావు, కర్రి ఆంజనేయులు, సీహెచ్. శ్రీనివాసరావు, ఏజీపీ డి. వెంకట్రావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా కృష్ణాపురంలో తహసీల్దారు వరహాలు, జనసేన నేత భాస్కరరావు మొక్కలు నాటారు. కొక్కిరాపల్లిలో కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, గ్రామజ్యోతి సభ్యులతో కలిసి ప్రధాన రోడ్డు వెంబడి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు. మండలంలోని పులపర్తి(లక్కవరం) పీఏసీఎస్ ఆవరణలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజరు సామంత్ కుమార్, డీసీసీబీ సీఈఓ డీవీఎస్ వర్మ, జీఎం డి. శ్రీనివాస్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీడీసీ మేనేజరు దివ్య, నోడల్ అధికారి కిషోర్, బీఎం లావణ్య, సంఘ ముఖ్య కార్యదర్శి శివరామకృష్ణ, ఫీల్డ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునగపాకలో..

ప్రతి ఒక్కరూ ధనం మాదిరిగా వనాలను కూడా కాపాడుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. మండలంలో మెలుపాకలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, తహసీల్దార్ ఎస్ఎ.మహేశ్వరరావు, అధికారులు జ్యోత్స్నకుమారి, కూటమి నాయకులు దొడ్డి శ్రీనువాసరావు, కర్రి ఉస్తేలునాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాపూజీ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం పార్కు ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయలు ఏవీ.సీతారామమూర్తి, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు. పట్టణ శివారులో రహదారి వెంబడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలు తదితరులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి వెంకటరమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం, అరట్లకోట, రాజగోపాలపురం, సీతారాంపురం, తదితర గ్రామాలలో ఆయన మొక్కలను నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, రమేశ్, సచివాలయ సిబ్బంది ఎం. గణేశ్, టీడీపీ నాయకులు శింగంశెట్టి శ్రీనివాసరావు, కలిగట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని ఉపమాకలో గురువారం ఉపమాక ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, జగదీశ్వరరావు, తోలేటి శ్రీను మొక్కలు నాటారు. దేవవరంలో పాయకరావుపేట ఏఎంసీ చైర్మన్ దేవర సత్యనారాయణ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కొరిమి సూర్య గణేశ్ సత్యనారాయణ, చెల్లపు శ్రీను, యలమంచిలి అప్పలరాజు, దేవర బాబ్జీ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. రేబాకలో సాదిరెడ్డి చిన వెంకన్న, సాదిరెడ్డి వరప్రసాద్, సెక్రటరీ అర్జియ్య, ఎంపీటీసీ సభ్యుడు వెల్లంకి కాసుబాబు, కరణం సూరిబాబు, సాదిరెడ్డి బాబూరావు, శ్రీను,శానాపతి విజయ్‌కుమార్ మొక్కలు నాటారు.

కోటవురట్లలో..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. గురువారం కోటవురట్లలోని మరిడిమాంబ ఆలయం వద్ద ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాశీవిశ్వనాథం, ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు, సర్పంచ్ అనిల్‌కుమార్, ఏపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేట పట్టణ శివారులో రహదారి పక్కన మొక్క నాటుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్. చిత్రంలో తోట నగేష్, తదితరులు


నక్కపల్లి: దేవవరంలో మొక్కలు నాటుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ


కోటవురట్ల మరిడిమాంబ ఆలయం వద్ద మొక్క నాటుతున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు

ఘనంగా పైడితల్లి విగ్రహ ప్రతిష్ఠ



రాంబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతపాలెంలో నూతనంగా నిర్మించిన పైడితల్లి అమ్మవారి ఆలయం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహాన్ని పతిష్ఠించి పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకొని, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను నిర్వహించారు. ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, జడ్పీటీసీసభ్యులు డి.నాగరాజు, వైసీపీ నాయకులు పి.కిశోర్, గ్రామ పెద్దలు కె.చినబాబు, ఎస్.దేముళ్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా నవదుర్గామాత వార్షికోత్సవం

మండలంలోని కట్టుబోలులో గురువారం నవదుర్గామాత వార్షికోత్సవాన్ని వైభోగంగా నిర్వహించారు.ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

పంచాయతీకి ఆదాయాన్ని పెంచండి

» అధికారులకు వార్డు సభ్యులు సూచన


సమావేశమైన పంచాయతీ పాలకవర్గం

పాయకరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని పంచాయతీ వార్డు సభ్యులు సూచించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన పాలకవర్గం సమావేశంలో పంచాయతీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించే సేవలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో లీజు గడువు పూర్తయిన పంచాయతీ షాపులకు కొత్తగా వేలంపాటలు నిర్వహించి, పంచాయతీకి అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. తమ వార్డుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనిపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి శివరామ్ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు చర్చించిన సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, నారపురెడ్డి పద్మ, ధనిశెట్టి బాబి, దేవాది మంగాదేవి, దాసరి శ్రీను, పల్లా ప్రసాద్, తదితరులు, పంచాయతీ సిబ్బంది కుమారస్వామి, వరహాలు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

» ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు

అచ్యుతాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. గురువారం వెదురువాడలో జరిగిన సూర్యఘర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్‌కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయన్నారు. సౌర విద్యుత్ వినియోగదారులు సుమారు పాతిక సంవత్సరాల వరకు బిల్లులు కట్టనవసరం లేదన్నారు. సూర్య పథకం అమలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, వినియోగదారులు ముందుగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. ఈ పథకానికి బ్యాంకు రుణాలు మంజూరు చేస్తారని, అందువల్ల సౌర విద్యుత్ వినియోగానికి అంతా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఉన్న భవనంలో కమ్యూనిటీ మేనేజ్డ్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు డీఆర్‌డీఏ పీడీ శచీదేవి ఈ శిక్షణ కేంద్రం వివరాలను వివరించారు. ఏజెన్సీ నిర్వాహకులు మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి, వారికి ప్రతి నెలా రూ.10 వేలు పైబడి ఆదాయం వచ్చేలా చేస్తున్నామన్నారు. జిల్లాలో తొలిసారిగా ఈ కేంద్రాన్ని ఎలమంచిలిలో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మహిళలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళ పది మందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, వెలుగు ఏపీఎం, రాణి, శిక్షణ కేంద్రం ప్రతినిధి ప్రసాద్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

యర్రవరంలో ఘనంగా దుర్గామాత జాతర

మునిసిపాలిటీలోని యర్రవరం-2 వార్డులో గురువారం దుర్గామాత అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు తెల్లవారు జాము నుంచి ఆలయం వద్ద అమ్మవారిని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే విజకుకుమార్ దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పొంది వెన్నుపోటు అంటే ఎలా?

» వాడ్రాపల్లి సర్పంచ్‌పై ఎమ్మెల్యే విజయకుమార్ ధ్వజం

ఎలమంచిలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా పాలన చేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వాడ్రాపల్లి గ్రామ సర్పంచ్ నూకరాజు తన వద్దకు వచ్చి వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు తాగిన మద్యం కారణంగా తన లివర్ దెబ్బతిని అనారోగ్యానికి గురైనట్టు చెప్పారన్నారు. ఆయన దయనీయ పరిస్థితి చూసి మానవతా దృక్పథంతో పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి నుంచి సాయం చేశామన్నారు. కానీ అదే సర్పంచ్ వెన్నుపోటు దినం కార్యక్రమంలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని, ఎవరికి ఎవరు వెన్నుపోటు పొడిచారన్నది ప్రజలు గమనించాలన్నారు. కూటమి ప్రభుత్వం మనస్తత్వం ఏమిటి.. వైసీపీ మనస్తత్వం ఏమిటి అన్నది తెలియపరచాలన్న ఉద్దేశంతో చెబుతున్నానన్నారు. మునిసిపాలిటీలో అభివృద్ధి పేరుతో చెరువులను పార్కులుగా మార్చినప్పటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయన్నారు. కొందరు రాజకీయ నేతల అండదండలతో నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై రివ్యూ చేయడం జరుగుతుందన్నారు. విలేకర్ల సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లంక రాజు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శరణ్య వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఎస్.రాయవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో శరణ్య వేంకటేశ్వరస్వామి వారి ఆలయాలన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ప్రధాన ఋత్వికులు వాడపల్లి గోపాలాచార్యులు నిర్వహించారు. ఈ ఆలయాన్ని ఉప్పలపాటి వేంకటసూర్యనారాయణరాజు, అరుణకుమారి దంపతులు సొంత నిధులతో నిర్మించారు. గురువారం తెల్లవారు జాము నుంచి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.


తిమ్మాపురంలో ప్రతిష్ఠించిన శరణ్య వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఈదురుగాలులకు భవనంపై పడిన కొబ్బరి చెట్టు

» తప్పిన పెను ప్రమాదం

పాయకరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు స్థానిక పార్కులో కొబ్బరి చెట్టు విరిగి పక్కనే ఉన్న భవనంపై పడడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం నుంచి ఎండ కాసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పుతో ఆకాశం మేఘాలు కమ్మి ఈదురుగాలు వీచి ఒక మోస్తరు వర్షం పడింది. ఈదురుగాలులకు స్థానిక మంగవరం జంక్షన్ వద్ద ఉన్న పార్కులో ఉన్న కొబ్బరి చెట్టు మధ్యకు విరిగిపోయి పక్కనే ఉన్న భవనంపై పడింది. దీంతో భవనం రెండో అంతస్తు డాబా గోడ దెబ్బతిన్నది. అదే కొబ్బరిచెట్టు పార్కులో ఆటలాడుకుంటున్న పిల్లలపై పడితే పెను ప్రమాదం జరిగి ఉండేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.


కొబ్బరి చెట్టు విరిగి పక్క భవనంపై పడిన దృశ్యం

గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్

నక్కపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట, పెదతీనార్ల, కాగిత గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పర్యటించారు. బల్క్‌డ్రగ్‌కు సంబంధించి రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పలు నిర్మాణ పనులను పరిశీలించారు. పెదతీనార్ల పరిసర గ్రామాల్లో కొన్ని భూములను పరిశీలించారు. అవసరమైన అదనపు భూముల గురించి ఆరా తీశారు. ఆర్డీవో వీవీవీ రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తితో మాట్లాడారు. ఇందుకు సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. రాజయ్యపేట నుంచి అమలాపురం మీదుగా కాగిత హైవే వరకూ నిర్మిస్తున్న కారిడార్ నూతన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన భూములతోపాటు, మరికొన్ని మిగులు భూములను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశించారు.

మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పాయకరావుపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటకోటలో గురువారం మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి, విశాఖ మెరైన్ అడిషనల్ ఎస్పీ జీబీఆర్ మధుసూదనరావు ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించినట్టు పెంటకోట మెరైన సీఐ వై. మురళీరావు తెలిపారు. ఈ శిబిరంలో మంగవరం పీహెచ్‌సీ వైద్యులు ఎన్.సంకీర్తన, జి.స్వరాజ్యం రోగులను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రత్నశేఖర్, పీహెచ్‌సీ సిబ్బంది పి.రాముడు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు


జనసేన పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం/మునగపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసీపీ శ్రేణులు జనసేనలో చేరుతున్నారని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహం వద్ద మునగపాక మండలం రాజుపేట, గొల్లలపాలెం, నాగవరానికి చెందిన వైసీపీ శ్రేణులు జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిక్కులి పరశురాం, రమణ, అప్పలనాయుడు, నూకరాజు, రాము, లక్ష్మి, రామానాయుడు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సీట్లు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి ఆదర్శ పాఠశాలలో మిగిలి ఉన్న సీట్లు భర్తీకి విద్యా శాఖ నుంచి అనుమతులు వచ్చాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీఏస్.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా 7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు భర్తీకి కూడా దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అచ్యుతాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. గురువారం దుప్పితూరులో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ అన్ని డెయిరీల కన్నా తాము అధిక ధరకు రైతుల నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి. రమణారావు, రాము, నూకరాజు, శెట్టి శంకర్రావు, చిరంజీవి, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కైట్స్ విద్యార్థిని సుప్రియకు ప్రతిభా అవార్డు


సుప్రియను అభినందిస్తున్న కరస్పాండెంట్, అధ్యాపకులు

అచ్యుతాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కైట్స్ కాలేజీలో ఇంటర్ చదివిన పి.సుప్రియ ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. సుప్రియ ఎంపీసీలో 988/1000 మార్కులు సాధించి, ప్రతిభా అవార్డు సాధించింది. ఆమెకు రూ20 వేలు నగదుతోపాటు బంగారు పతకంతో ప్రభుత్వం సత్కరించనుంది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, డైరెక్టర్లు రెడ్డి గణేష్, వి.ప్రసాద్, ఎ. శంకరరావు, అధ్యాపకులు విద్యార్థిని సుప్రియను అభినందించారు.

సీపీఎం సమైక్యతా యాత్ర

అచ్యుతాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత వర్థిల్లాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రొంగలి రాము అన్నారు. గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో సమైక్యతా యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పహల్గాం దాడి అనంతరం దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన సైనికులకు సెల్యూట్ చేస్తూ యావత్ దేశమంతా అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కె. సోమునాయుడు, ఆర్ .లక్ష్మి, సత్యవతి, దేవుడమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పరదిబ్బ కొత్తమహాలక్ష్మి పండగ

మునగపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉప్పరదిబ్బ రైతు మూలసంఘం ఆధ్వర్యంలో కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. మూల సంఘానికి చెందిన రైతు కుటుంబీకులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలో సంఘం ప్రతినిధులు, సభ్యులు పెంటకోట వెంకటి, మళ్ల అప్పారావు, మళ్ల సూరిబాబు, ఆడారి అప్పలనాయుడు, దాడి సీతారాం, దాడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామాయణం విశిష్టత భావి తరాలకు తెలియాలి

మునగపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామాయణం విశిష్టత భావి తరాలకు తెలియాలని మాజీ సర్పంచ్ మళ్ల రమణమ్మ పిలుపునిచ్చారు. మండలంలో వాడ్రాపల్లి పెదరామాలయంలో గురువారం ప్రవచనకర్తను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీటీడీలో శిక్షణ పొందిన బుద్ధ నరసింహమూర్తి ధర్మాచార్యగా రామాయణం గురించి ప్రచారం చేయడం శుభపరిణామం అన్నారు. నిత్యం ఆధ్యాత్మిక సేవలందిస్తున్న పెతకంశెట్టి రామజోగినాయుడు ఆధ్యాత్మిక సేవలు ఆదర్శమన్నారు.

పని గంటలు పెంచడం తగదు

» సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి

మునగపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పని గంటలు పెంచడం కార్మిక చట్టాలకు తూట్లు వేయడమే అవుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న కార్మికులు 8 గంటలను 12 గంటలు చేస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది కాదన్నారు. 1886లో చికాగోలో పోరాడి సాధించుకున్న పని గంటల్లో మార్పులు తీసుకు రావడం ద్వారా కార్మికులను మరింత శ్రమించడమే అవుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నర్సాపురం డ్యాం గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

ఆనకట్టల మరమ్మతుపై ప్రత్యేక దృష్టి

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆనకట్టలు, గ్రోయిన్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిసారించామని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. మండలంలోని నర్సాపురం ఆనకట్టను, వాటి గేట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన ముందుకు సాగుతుందన్నారు. సోలార్ విద్యుత్ వల్ల పర్యావరణ రక్షణతో పాటు పేదలకు విద్యుత్ భారం ఉండదన్నారు. నియోజకవర్గంలో పది వేల గృహాలకు సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఏపీడీ మణికుమార్, ఏపీవో శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, కూటమి నాయకులు పొన్నగంటి అప్పారావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కర్రి సత్యనారాయణ, ఎన్.రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు, సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు ప్రాధాన్యం

రాయితీ దాణాను వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే కొణతాల

కశింకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రైతులకు అధిక ప్రాధాన్యత ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. మండలంలోని సోమవరం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత మిశ్రమ దాణా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 50 శాతం రాయితీపై పాడి రైతులకు దాణాను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1500 కిలోల దాణాను పాడి రైతులకు మంజూరు చేశామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను తీసుకు వస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి బి.రామ్మోహనరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు డాక్టర్ బి.సౌజన్య, మండల పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జి పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాల నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



నూతన పాలకవర్గం ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. అనకాపల్లి వర్తక సంఘం కార్యదర్శులు తమ్మిన రఘుబాబు, కొణతాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడిగా శ్రీధరాల కృష్ణ పేర్రాజు, కరస్పాండెంట్‌గా పెంటకోట వెంకటరామారావు (శ్రీను), కార్యవర్గ సభ్యులుగా పెంటకోట ఉమామహేశ్వరరావు, పెంటకోట బాలకృష్ణ, బొండాడ రాజేష్, ఉద్దగిరి కృష్ణకిశోర్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ఉపాధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, కార్యాలయ పర్యవేక్షకురాలు పెంటకోట అనురాధ, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు, కొణతాల రామకృష్ణ, కొణతాల రాజాబాబు పాల్గొన్నారు. అనంతరం వర్తక సంఘం, అనుబంధ సంస్థల ప్రతినిధులు నూతన కార్యవర్గం ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

26న బార్ అసోసియేషన్ ఎన్నికలు



షెడ్యూల్ విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి సాయి ప్రభాకర్

అనకాపల్లి టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 26న నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి బుద్ధ సాయి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 19, 20 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 21న పరిశీలన చేస్తామన్నారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక 23తో ప్రక్రియ ముగుస్తుందన్నారు. 26న ఎన్నికలు జరుగుతాయన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి తదితర పదవులకు పోటీపడే వారు దరఖాస్తులను నిర్ణీత రుసుము చెల్లించి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, సీనియర్ న్యాయవాదులు చందు, శ్రీనివాసరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో సినిమా షూటింగ్ సందడి



ముత్యమాంబ ఆలయంలో మహూర్తపు షాట్‌కు క్లాప్ కొడుతున్న దృశ్యం

సబ్బవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సబ్బవరం దరి ముత్యమాంబ ఆలయంలో నూతన నటీనటులతో తెరెక్కుతున్న సినిమా 'రజనీ కల్యాణం' మహూర్తపు షాట్‌కు ఉప సర్పంచ్ మండల లక్ష్మణ క్లాప్ కొట్టారు. వారాహీ క్రియేషన్స్ సంస్థ నిర్మాణంలో నూతన దర్శకుడు రజనీకల్యాణ్ పల్ల ఆధ్వర్యంలో షూటింగ్ జరిగింది. షూటింగ్ చూసేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా దర్శకుడు రజనీ కల్యాణ్ మాట్లాడుతూ నూతన నటీనటులతో గ్రామీణ కథాశంతో సినిమా నిర్మిస్తున్నామని, ఈ ప్రాంతంలోని కొంత మందికి చిత్రంలో నటించే అవకాశం కల్పించామని చెప్పారు. నెల రోజుల వ్యవధిలో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నూతన నటులు గెడ్డం రమణ, శర్వాణ్, సుస్మిత, పళ్ల సత్యనారాయణ, అప్పలనాయుడు, డి.శ్రీనివాసరావు, కమెడియన్‌గా శాంతారాం, జోగిన్, అనీష్ నటిస్తున్నారని ఆయన చెప్పారు.

వాడవాడలా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

మొక్కలు నాటిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల/సబ్బవరం/కశింకోట/పరవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం వాడవాడలా నిర్వహించారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి నీరు పోశారు. గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో డీఈవో గిడ్డిఅప్పారావునాయుడు, జిల్లా ఉమ్మడి పరీక్ష బోర్డు కార్యదర్శి సత్యనారాయణ, ఏపీఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త ఎస్.ఖగేశ్వరరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆర్టీసీ డిపో ఆవరణలో డీపీటీవో కె.పద్మావతి, డీఎం ఎల్‌వీ.రావు మొక్కలు నాటారు. అనంతరం గ్యారేజీ ఆవరణలో కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. డైట్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో శానిటరీ విభాగం సూపర్‌వైజర్ రవికుమార్ మొక్కలు నాటారు. అలాగే మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో అదనపు జిల్లా జడ్జి నరేశ్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. మాకవరంలో గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో క్వారీ, క్రషర్ల యాజమాన్యాలు చెట్ల పెంపకంపై బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నూకరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కె.బాబి, ఎంపీటీసీ సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బరంలో పార్టీ నేతలతో ఆయిల్ ఫెడ్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావి తరాల బంగారు భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిబివిఎస్ఎన్.రాజు, గండి దేముడు, బంగారునాయుడు, అంగటి నానాజీ, కొరాడ శ్రీను, గొర్లి కృష్ణ పాల్గొన్నారు. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జిలానీ బేగం, సీనియర్ అసిస్టెంట్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అగ్రహారం వీధిలో పడమటమ్మ తల్లి ఆర్చి నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు రోడ్డుకిరువైపులా నేరేడు, బాదం, పనస, కానుగ తదితర 28 మొక్కలను నాటారు. మారుతున్న జీవనశైలి, అధిక జనాభా, అటవీ నిర్మూలన ప్రకృతికి గొడ్డలి పెట్టులా మారాయని ఈ సందర్భంగా వివేకానంద విద్యా సంస్థల చైర్మన్ మళ్ల జగదీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కశింకోట పురవీధుల్లో నినాదాలు చేసి అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్, విశ్వ భారతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మళ్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న పిలుపునిచ్చారు. పరవాడ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రావాడలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కొబ్బరి మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోన కృష్ణ, సాలాపు రమణ, మరిసా అప్పలరాజు, మోటూరి అప్పారావు, మోటూరి సూరిబాబు, మరిసా యర్రయ్యనాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు. అలాగే సిద్ధి వేంకటేశ్వర హార్టికల్చరల్ అండ్ సివిల్ వర్క్స్ మేనేజింగ్ పార్టనర్ లాలం అప్పలనాయుడు, ఉమామహేశ్వరి సమకూర్చిన మొక్కలను వీఎంఆర్‌డీఏ స్థలంలో గురువారం నాటారు. ఈ సందర్భంగా పలు పండ్ల రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, సర్పంచులు శిరపురపు అప్పలనాయుడు, రుత్తల గుణశేఖర్, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, గొర్లి కనకారావు, గొర్లి ఎరుకునాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, నగిరెడ్డి చిన్నారావు, రేలంగి ధనరాజ్, ఆర్‌వీ నారాయణ, కృష్ణమూర్తి, పైలా బుజ్జి, పైలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు కాలుష్యం నియంత్రణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాకవరంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



సబ్బవరంలో మొక్కలు నాటుతున్న గండిబాబ్జీ



అనకాపల్లిలోని గవరపాలెం పాఠశాలలో మొక్కలు నాటిన డీఈవో



పరవాడలో మొక్కలు నాటుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న

యోగాతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలాజీ

అనకాపల్లి టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల నివారణ జరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలాజీ చెప్పారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా గురువారం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో యోగాంధ్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి యోగా గురువులు బి.అప్పారావు, దొర్రం నాయుడు, మంగియ్య పర్యవేక్షణలో యోగాసనాలు వేయడం జరిగింది. అనంతరం డీఎంహెచ్‌వో బాలాజీ, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం నుంచి ఎన్టీఆర్ వైద్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యోగా చేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి శ్రావ్యశ్రీ, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న డీఎంహెచ్‌వో వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

మారేడుపూడి ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహం

అనకాపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుపూడి గ్రామం లోని ఆలయంలో గురువారం శ్రీకృష్ణుని విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పుణ్యాహవచనం, అగ్నిజ్ఞానం, రత్నన్యాసం చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో గరుడిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల పని గంటల పెంపు సరికాదు

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సంక్షేమం దృష్ట్యా లేబర్‌కోడ్స్ అమలును రాష్ట్రంలో తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పనికోసం పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పేర్కొన్నారు. కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్‌లకు ఇబ్బడి ముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. శాస్త్ర సాంకేతికత అభివృద్ధి జరుగుతున్న కాలంలో మానవ శ్రమను తగ్గిస్తున్న ఆధునిక యుగంలో పని గంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణమని వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లంకెలపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెదముషిడివాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ లంకెలపాలెం సెక్షన్ ఏఈ వినోద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లంకెలపాలెం, శ్రీరామ్‌నగర్, గంగిరెడ్ల కాలనీ, వినాయక నగర్, గెంజిపేట, గొల్లపేట, శ్రీరంగనాగర్, పెదముషిడివాడ, నక్కవానిపాలెం, పచ్చికోరువానిపాలెం, గండివానిపాలెం, విజయరాంపురం, మార్కండేయనగర్, ఇ-మర్రిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, గొన్నవానిపాలెం, కన్నూరు, మంత్రిపాలెం, మడకపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పథకాన్ని పక్కా అమలుచేయాలి

▸▸ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి డిమాండ్

పరవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని కలపాక గ్రామంలో గురువారం పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. కూలీల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం రోజుకు రూ.309 వేతనం చెల్లించాలని ఆయన కోరారు.



పని ప్రదేశంలో నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు

ఘనంగా గ్రామ దేవతల మారువారం పండుగ



బంగారమ్మతల్లిని దర్శించుకుంటున్న గండి బాబ్జీ తదితరులు

సబ్బవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం శివారు గొర్లివానిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదేవతలు బంగారమ్మ, కుంచాలమ్మ మారువారం పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రజలు అమ్మవార్లను దర్శించుకుని దూప, దీప నైవేద్యాలతో విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ అన్న సమారాధన జరిగింది. అనంతరం తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీలు, నేల డ్యాన్స్‌లు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామ పెద్దలు గొర్లి కృష్ణ, రమణ, పైడింనాయుడు, దేముడుబాబు ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్.రాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ గండి దేముడు, ఎంపీటీసీ సభ్యుడు చైతన్య పాల్గొన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లంకెలపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెదముషిడివాడ శివారు పచ్చికోరువానిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ పండుగ గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 6 గంటల అమ్మవారి దర్శనాలను ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించి అనంతరం ఆలయం వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి అలమండ నరేశ్ పాల్గొన్నారు.

ఉగ్గినపాలెం ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగసిపడుతున్న మంటలు

కశింకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం వద్ద ఉన్న ఒక ప్రైవేటు కంపెనీకి చెందిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో పరిసర ప్రాంతాలు నల్లని పొగతో కమ్మేశాయి. ఒక పక్క మండుటెండలు ఉండడంతో ఆ ప్రాంతమంతా మరింత అగ్నిగుండంలా తయారైంది. కాగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ముందుగా పెద్ద శబ్దం వచ్చి మంటలు ఎగసిపడ్డాయి. జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో పేలే సమయంలో ఎటువంటి వాహనాలు వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు, విద్యుత్ శాఖాధికారులు ఊపిరి తీసుకున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి

కొత్తూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాలు ఉన్నాయని, వాటిని కొద్దిపాటి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకు రావచ్చని చెప్పారు. ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయనే సాకుతో ప్రైవేటు భవనాల్లోకి మార్చి లక్షలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అనకాపల్లి ప్రాంతంలోనే ఏ ప్రభుత్వ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితుల్లో ఉండడం విచారకరమన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

కశింకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో గురువారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ వేసేటప్పుడు పాటించాల్సిన పద్ధతులను డ్రాయింగ్ మాస్టారు హరినాథ్ విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న విజ్ఞానాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదివి ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కొణతాల జగన్ పాల్గొన్నారు.



డుంబ్రిగుడ: అడవుల పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర, అధికారులు


చిలకలగెడ్డలో మొక్కలను నాటుతున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు

అడవులను పరిరక్షించుకోవాలి

- కలెక్టర్ దినేశ్‌కుమార్
- ఘనంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

డుంబ్రిగుడ,జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అరకు (ఫైనరీ) అంజోడ సిల్క్ ఫారంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో పోస్టర్ల ఆవిష్కరించారు. పర్యావరణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా 27 లక్షల మొక్కలు, 11 హెక్టార్లలో నాటడానికి చర్యలు తీసుకున్నామన్నారు. గురువారం ఒక్కరోజు అన్ని శాఖలను కలుపుకుని 3. 45 లక్షల మొక్కలను నాటినట్టు చెప్పారు. పర్యావరణం ప్రస్తుతం ప్రమాదకర స్థితిలో ఉందని, దీనిని పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. డీఎఫ్‌వో సందీప్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఎంతైన ఉందని చెప్పారు. అనంతరంఆర్టీసీ విజయనగర్ జోన్ చైర్మన్ దొన్నుదొర మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం పీడీ విద్యా సాగర్, ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, స్థానిక సర్పంచి కోములు, ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, దనేశ్వరరావు, అరకులోయ సర్పంచి దాసుబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జి చిరంజీవి, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: జీసీసీ చైర్మన్ కిడారి

అనంతగిరి: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్నారు. మొక్కలు నాటారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాలు పడేందుకు చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మితుల, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఎ. బుజ్జిబాబు, నాయకులు మజ్జి భీమరాజు, టి. ఆనందరావు, పి.జగన్ బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల, బి.లక్ష్మణ్‌రావు, వైస్ సర్పంచ్ నరేంద్ర, సన్నీబాబు, తిరుపతిరావు, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఆదివాసీలు అడవులను సంరక్షించుకోవాలని స్థానిక డివిజనల్ ఫారెస్టు అధికారి వైవీ నరసింహరావు సూచించారు. గురువారంగిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఎఫ్‌వో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో కలిసి 100 మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. వనమహోత్సవం పురస్కరించుకుని డివిజన్ పరిధిలో 25వేల మొక్కలు నాటామన్నారు. అక్టోబరు వరకు 50 వేల మొక్కలు నాటనున్నట్టు చెప్పారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలు, ఏపీఆర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పల స్వామి, తహసీల్దార్ టి. రామకృష్ణ, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాస రావు, రేంజ్ అధికారి బి. అప్పారావు, ఏపీడీ లాలం సీతయ్య, ఎంఈవోలు పనసల ప్రసాద్, గెమ్మెలి బోడం నాయుడు, పీజీహెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్, ప్రిన్సిపాల్ రామేశ్వరం, ఎస్ఐ ఎం. వెంకటరమణ, డీటీ చంద్రశేఖరరావు, కూటమి నాయకులు రీమల ఆనందరావు, వల్లీ, మంగు, అప్పారావు, అడ్డాబు లక్ష్మణరావు, డీఆర్‌వో వెంకటరాజు, ఎఫ్‌బీవోలు మండి భూషణం, డి. పుష్ప పాల్గొన్నారు.

పాడేరులో..

పాడేరురూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి జి. గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల, నీరు, గాలి కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మొక్కలను నాటారు. ఏపీఆర్ కళాశాల, పాఠశాల, శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాల, లోచలిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ప్రాంగణంలో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా చేపట్టారు.


ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి, తదితరులు

కొయ్యూరులో..

కొయ్యూరు:బూదరాళ్ల పంచాయతీలో పలు గ్రామాల్లో పాఠశాలలు, ఖాళీ స్థలాలలో ఎంపీడీవో జీవీడీ ప్రసాదరావు, ఉపాధి ఏపీవో, అటవీ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో సర్పంచ్ బాలరాజు, టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబుమొక్కలు నాటారు. మాకవరంలో, కృష్ణ దేవిపేట రేంజర్ శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజర్ సత్యనారాయణ, టీడీపీ నేత భీమరాజు, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం దేవేశ్వరావు పాల్గొన్నారు. డౌనూరు, మూలపేట పంచాయతీలలో ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, సర్పంచ్ రావుల వెంకట లక్ష్మి మొక్కలు నా టారు.

గూడెంకొత్తవీధిలో..

గూడెంకొత్తవీధి: స్థానిక ఎంపీపీ బోయిన కుమారి మండల కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి ఉపాధి హామీ ద్వారా 8,500 మొక్కలు వచ్చాయని, పంచాయతీలకు వీటిని పంపిణీ చేశామన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో 500మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు, ఈవోఆర్‌డీ పాపారావు, అటవీశాఖ డీఆర్‌వో కృష్ణారావు, ఎఫ్‌బీవోలు శ్రీనివాసరావు, వీరభద్రరావు, సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, కోఆప్షన్ సభ్యుడు దావీదు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కొమ్మంగిలో మొక్కలు నాటుతున్న రీజనల్ మేనేజర్ జ్యోతి

చింతపల్లి, ఆర్‌వీ నగర్ డివిజన్ పరిధిలో 1.5 లక్షల మొక్కల నాట్లు : ఏపీఎఫ్‌డీసీ విశాఖ రీజనల్ మేనేజర్ జ్యోతి

గూడెంకొత్తవీధి: చింతపల్లి, ఆర్‌వీనగర్ డివిజన్ పరిధిలో 1.5 లక్షల మొక్కలు నాటినట్టు ఏపీఎఫ్‌డీసీ విశాఖపట్నం రీజనల్ మేనేజర్ డాక్టర్ టి. జ్యోతి తెలిపారు. గురువారం చింతపల్లి, ఆర్‌వీనగర్ డివిజన్ల పరిధిలో ఏపీఎఫ్‌డీసీ అధికారులు వనమహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మొక్కల నాట్లును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీనగర్ డీఎం డాక్టర్ ఎ. త్రిమూర్తులు, చింతపల్లి డీఎం పి. రత్నదీప, సర్పంచ్‌లు అరుణ్, పి. లక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంటా నళిని పాల్గొన్నారు. లోతుగెడ్డ అటవీశాఖ రేంజ్ అధికారి ఎల్‌బీకే పాత్రుడు ఆధ్వర్యంలో బీరం పంచాయతీ వి.కోడాపల్లి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కొత్తపల్లి జలపాతంలో ఏకోటూరిజం సభ్యులు జలపాతం వద్ద వివిధ పండ్ల మొక్కలు నాటారు. అటవీఅధికారి ఎం.బాబురావు, సిబ్బంది శ్రీనివాస్‌ప్రసాద్, దివ్య, గోవింద్, ఎం.బాలన్న, సర్పంచ్ రత్నకుమారి, పంచాయతీ సిబ్బంది వరహాలనాయుడు, ఈవోపీఆర్డీ డేవిడ్, ఏకోటూరిజం సభ్యులు అభి, రాజు పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరు: వృక్షాలు మనిషికి ప్రాణవాయువునిస్తున్నట్టు సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. సీలేరు టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన మాట్లాడారు. రేంజ్ అధికారి ఏపీ జెన్‌కో ఎస్‌సీ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు. సర్పంచ్ దుర్గో, ఎంపీటీఈ సభ్యుడు పిల్ల సాంబమూర్తి, డీ ఆర్‌వో సింహాచలం పాల్గొన్నారు.


చింతపల్లి ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో నరసింహరావు, తహసీల్దార్ రామకృష్ణ, అధికారులు


కొయ్యూరు: పెదమాకవరంలో మొక్కలు నాటుతున్న అటవీ సిబ్బంది


సీలేరులో రేంజ్ అధికారి వెంకటేశ్వరరావు, ఎస్‌ఈ చంద్రశేఖర్..

సికిల్ సెల్ అనీమియా బాధితురాలికి ఆర్థిక సహాయం

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చిన్నారి వైద్య సేవలకు ఆర్థిక సహాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

కొయ్యూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ అనీమియా బాధితురాలికి మల్లవరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధి టి. మల్లేశ్ ఆధ్వర్యంలో సభ్యులు రూ 10 వేలు సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'అక్కా చెల్లెళ్లకు సికిల్ సెల్ అనీమియా' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన హెల్పింగ్ హ్యాండ్ సంస్థ బాధితురాలు మెరుగైన వైద్య సేవలకు గురువారం ఈ సాయమందించారు. చిట్టింపాడు పంచాయతీ గోపవరానికి చెందిన దవల భాగ్యశ్రీ, యోధశ్రీ సికిల్ సెల్ అనీమీయా బారిన పడ్డారు. శనివారం యోధశ్రీ వైద్య సేవలు పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. మృతురాలి అక్క భాగ్యశ్రీ నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతోంది. అయితే మెరుగైన వైద్య సేవలకు విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు.ఆర్థిక స్తోమత లేక తల్లితండ్రులు కుమార్తెకు నర్సీపట్నంలోనే వైద్య సేవలందిస్తున్నారు. ఈ విషయాన్ని'ఆంధ్రజ్యోతి' కథనం వెలుగులోకి తేవటంతో పాటు గోపవరానికి చెందిన పెట్ల గాంధీ అభ్యర్థన మేరకు బాధితురాలికి రూ. 10 వేలతో పాటు పండ్లు అందచేశారు. ఈ కార్యక్రమం లో సంస్థ ప్రతినిధులు కె. హరిదేవ్, లక్ష్మణ్ మాస్టారు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్య అందించాలి'

అనంతగిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములియగుడ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఇంగ్లీష్ మీడియం శారదా నికేతన్ పాఠశాలను గురువారం అడిషనల్ కమిషనర్ (రిటైర్ అధికారి) ఎమ్ఎస్‌వీ వరహాల రెడ్డి ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు గిరిజన ప్రాంతంలో శారదాట్రస్టు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శారదానికేతన్ ఎండీ తిరుపతిరావు, తహసీల్దార్ వీ మాణిక్యం, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, సర్పంచ్ మోస్య, వైస్ సర్పంచ్ నర్సన్న పాల్గొన్నారు.

654 క్వింటాళ్ల ఖరీఫ్ విత్తనాలు సిద్ధం


డి. ఉమాదేవి
ఏవో , కొయ్యూరు

కొయ్యూరు జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఖరీఫ్‌కు సంబంధించి 654 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధచేసినట్టు ఏవో డి. ఉమాదేవి తెలిపారు. గత ఏడాది 5024 ఎకరాల సాగుకాగా, ఈ సంవత్సరం విజన్ 2047లో భాగంగా మరో 500 ఎకరాల విస్తీర్ణం పెంచాలనే యోచనతో 5800ఎకరాలకోసం 80 టన్నులు వరి విత్తనాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. మొదటివిడతగా 654 క్వింటాళ్లు మంజూరు చేశారన్నారు. 200 విత్తనాలకు మరో దఫా ప్రతిపాదనలు పంపామన్నారు. మంజూరైన వాటిలో ఆర్ఎస్ఆర్ 15048 రకం 150 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 200, బీపీటీ 50, ఎంటీయూ 1121 రకం 80, ఎంటీయూ 1064 రకం 50, ఎంటీయూ 1224 రకం 24, ఎంటీయూ 1318 రకం విత్తనాలు 100 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. వీ టిని రైతులకు 90 శాతం రాయితీపై అందిస్తామని వివరించారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి గానూ 17, 461 మంది దరఖాస్తు చేసుకోగా.. వాటిలో 15, 006 మంది రైతులను అర్హులుగా గుర్తించామని ఏవో ఉమాదేవి తెలిపారు.

వైసీపీదే వెన్నుపోటు వైఖరి: టీడీపీ

జి.మాడుగుల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి నిజమైన వెన్నుపోటుకు లోనుచేసింది వైసీపీయేనని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వంతాల కొండలరావు, కల్యాణం ఆరోపించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ప్రజలను వంచించిన ఆ పార్టీ వెన్నుపోటు దినం పేరిట కార్యక్రమాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని వారు విమర్శించారు. గత ఐదేళ్ల పాలనతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవినాయుడు, శాంతికుమారి, బీంబాబు, వెంకటరమణ, చంటిబాబు, చిన్నాచారి, బాబురావు, అన్నపూర్ణ, బంగరయ్య పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవోగా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్

పాడేరురూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవోగా ఎం.కిరణ్‌కుమార్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. పెదబయలు మండలం గోమంగి పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ సేవలను గుర్తించిన డీఎంహెచ్‌వో, కలెక్టర్ ఆయనకు గతంలో జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్‌గా బాధ్యతలను అప్పగించారు. ఆ పనులను ఎంతో బాధ్యతగా నిర్వహిస్తున్నట్టు గుర్తించిన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవోగా ఉత్తర్వులను జారీ చేశారు. గురువారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన కలెక్టర్, కమిషనర్, డీఎంహెచ్‌వోలకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనులకు వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు.


వి. కోడాపల్లిలో పొలాల్లో దుక్కి చేపడుతున్న గిరిజన రైతు


వరి నారు

ముమ్మరంగా ఖరీఫ్ పనులు

జి. మాడుగుల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఖరీఫ్ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. వరి సాగుకు అనుకూలంగా పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఎద్దులతో పాటు యంత్రాలతోనూ దుక్కులు చేపడుతున్నారు. ఈఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. మండల వ్యాప్తంగా 8,743 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. ఎక్కడ చూసిన దుక్కి పనుల్లో గిరిజనులు నిమగ్నమై ఉన్నారు. ఉదయం ఎద్దులతో మధ్యాహ్నం యంత్రాలతో ఈ పనులు ముమ్మరం చేస్తున్నారు. ఈ సారి తొలకరి నుంచి వర్షాలు అధికంగా కురవడంతో ముందుగానే వరి నారు మడులు సిద్ధం చేశారు. ఫలితంగా నారు ఏపుగా ఎదగడంతో పంటకు అనుకూలంగా ఉంటుందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు. సాధారణంగా మే నెల రెండవ వా రం నుంచి ఖరీఫ్ సాగుపనులకు రైతులు సన్నద్ధమవుతారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో పొలాల్లో పుష్కలంగా నీరు చేరింది. దీనికితోడు రుతు పవనాలు ప్రవేశించినట్టు వాతావరణ నిపుణులు పేర్కొనడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

8,743 ఎకరాల్లో వరి సాగు

మండల వ్యాప్తంగా 8,743 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంట వేస్తున్నారు. ఇందులో ఆధునిక పద్ధతులతో వరి వంగడాలపై అనేక గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించడం జరిగింది. దీంతో ఖరీఫ్‌తో పాటు రబీలో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

-లకే పాత్రుడు, మండల వ్యవసాయాధికారి , జి.మాడుగుల

వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలకు ఆర్థిక సహకారం

- నాబార్డు డీడీఎం గౌరీశంకర్


ఎఫ్‌పీవో ప్రతినిధులతో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం గౌరీశంకర్

చింతపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వ్యవసాయ అనుబంధరంగ చిన్నతరహా పరిశ్రమలు స్థాపించే రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నాబార్డు ఆర్థిక సహకారం అందిస్తుందని జిల్లా అభివృద్ధి మేనేజర్ (డీడీఎం) వి. గౌరీ శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. స్థానిక అరుణతార, సుగుమణ రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యాలయాలను తనిఖీ చేశారు. ఎఫ్‌పీవో పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికపై సీఈవో, డైరెక్టర్లతో చర్చించారు. ఈసందర్భంగా డీడీఎం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం, పిప్పలి, రాజ్‌మా, వలిసెలు పంటల ప్రాసెసింగ్ యూనిట్లు, విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. గిరిజనులు పండించిన వ్యవసాయ, ఉద్యాన, అటవీ ఉత్పత్తులను గ్రేడింగ్, ప్రాసెసింగ్ చేసి విలువలు జోడించి ఎగుమతులు చేయగలిగితే అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. గిరిజన ప్రాంతం కేంద్రంగా ఎఫ్‌పీవోలు చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటువల్ల రైతులకు మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అరుణతార, సుగుమణ ఎఫ్‌పీవోల ప్రతినిదులు శ్రీనివాసరావు, రాజేశ్, రవి, భూపతి, బాలరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి


ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కరుణతో మాట్లాడుతున్న బీజేపీ, జనసేన నాయకులు

చింతపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో తాగు నీటి పథకాలు నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు కోరారు. గురువారం కడశిల్ప, జనుగూరు గ్రామాలకు చెందిన గిరిజనులతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కరుణ వినతిపత్రమిచ్చారు. తాగునీటి సమస్యలను వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో జల్‌జీవన్ మిషన్ పథకాలు గిరిజన ప్రాంతానికి మంజూరు చేసిందన్నారు. కొన్నిచోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండగా, మరికొన్ని పథకాల పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. దీంతో గిరిజనులు ఊటగెడ్డ నీళ్లను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. జనుగూరు, కడశిల్ప గ్రామాల్లో ప్రభుత్వానికి తాగునీటి పథకాల కోసం ప్రతిపాదనలు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు చిన్నారావు, కిశోర్ కుమార్, కృష్ణారావు, త్రినాథ్, రామ్‌చరణ్, సాయితేజ, సిద్ధార్థ పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న పోస్టాఫీస్ సిబ్బంది

అనంతగిరి, జూన్ మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకోట, గరుగుబిల్లి బ్రాంచీల పరిధిలోని పలు గ్రామాల్లో గుమ్మకోట అసిస్టెంట్ బ్రాంచి పోస్ట్‌మెన్ అభిరామ్ ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్‌పై గురువారం అవగాహన కల్పించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర ఆదేశాల మేరకు.. గిరిజన గ్రామాల్లో జనాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుకునేందుకు తప్పనిసరిగా మహిళలు. పురుషులు తమ పోస్టల్ అకౌంట్లకు తప్పనిసరిగా అనుసంధానం చేయించుకోవాలని కోరారు.

విధిగా పీఎం పోషణ


పీఎం పోషణపై వివరిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ రమణ

జి.మాడుగుల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పీఎం పోషణ విధిగా పాటించాలని జిల్లా డీఈవో కార్యాలయ కో-ఆర్డినేటర్ వి.రమణ సూచించారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలు పునఃప్రారంభానికి విద్యార్థులకు రుచికరమైన భోజనాలు అందించాలని ఆదేశించారు. భోజనాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబూరావుపడాల్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి: ఎంపీపీ


ముంచంగిపుట్టులో మొక్కలు నాటుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జూన్ 5 (ఆంధ్రజ్యో తి):విరివిగా మొ క్క లు నాటాలని ఎంపీపీ ఎ. సీతమ్మ పిలుపునిచ్చారు. స్థాని క అంబేడ్కర్ పార్కు లో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండలంలో 18 సచివాలయాల పరిధిలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దార్ నర్సమ్మ, ఏపీవో వెంకటేశ్వరరావు, పీఆర్ఏఈ మురళీకృష్ణ, ఎస్ఐ జె.రామక్రిష్ణ, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు కె.సన్యాసమ్మ, ఫారెస్టు బీట్ అధికారులు నారాయణపడాల్, రుక్మిణి, శ్రీను, కార్తీక్, రామారావు, నేతలు జయదేవ్, బలరాం, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేప కోసం కొంగ జపం

- పొలాల్లో కొంగలు కనువిందు

ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో గిరి రైతులు వేసవి దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులు పొలాలను దున్నుతున్న క్రమంలో ఆయా నీటి మడుగుల్లో చేపల కోసం కొంగలు మాటేసి వాటిని చిక్కించుకుంటున్నాయి. ఈ క్రమంలో పాడేరు మండలం గబ్బంగి వద్ద దుక్కి పనులు జరిగిన ప్రాంతంలో చేపల కోసం కొంగలు జపం చేస్తున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

- పాడేరు/ఆంధ్రజ్యోతి


పాడేరు మండలం గబ్బంగి ప్రాంతంలో నీటి మడుగులోని చేపల కోసం చూస్తున్న కొంగ


నర్సీపట్నం: మొక్కలు పంపిణీ చేస్తున్న పీఆర్‌టీయూ అధ్యక్షుడు డీజీనాథ్


గొలుగొండ: గురుకుల కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో


మాకవరపాలెం: శెట్టిపాలెంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

పర్యావరణ దినోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సీపట్నం/మాకవరపాలెం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/నాతవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ రెండు మొక్కలు నాటాలని నర్సీపట్నం మునిసిపల్‌ కౌన్సిలర్‌ చింతకాయల పద్మావతి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. ఇందులో భాగంగా బలిఘట్టం-దర్శసాగరం రోడ్డులో అటవీశాఖ సామాజిక వన విభాగం సహకారంతో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో కౌన్సిల్‌ పద్మావతి పాల్గొన్నారు. గ్రీన్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో డీజీనాథ్‌ సబ్‌ కలెక్టర్‌ కార్యాలయం వద్ద మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్‌ కార్యాలయంలో డీఎస్‌పీ శ్యామ్‌సుందర్‌, ఎంపీడీవో కె.ఉషశ్రీ, టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, ఈర్లి రాజుబాబు పాల్గొన్నారు.

గొలుగొండ మండల కేంద్రంలోని గురుకుల కళాశాలలో ఎంపీడీవో మేరీరోజ్‌, ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ లక్ష్మణ్‌, ఎస్‌ఐ రామారావు మొక్కలు నాటారు. కొత్తఎల్లవరం అమ్మపేట గ్రామాల్లో సర్పంచ్‌లు కొల్లి రాంబాబు, నిద్ర దేముడు నాయుడు మొక్కలు నాటారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదామని వారు పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి పరిరక్షణ సాధ్యపడుతుందని కృష్ణాదేవిపేట అటవీ రేంజ్‌అధికారి కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీహెచ్‌.నాగాపురం, ఏఎల్‌పురం, పి.మాకవరం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అటవీఅధికారులు చేతుల మీదుగా కానుగ, టేకు, వేప తదితర పలు జాతుల మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ఉద్యమంగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు యలమంచిలి రమురామ్‌, సూకాలమ్మ, డిప్యూటీ రేంజ్‌ అధికారి ఓ.సత్యనారాయణ, అటవీ సిబ్బంది ఎరుకులమ్మ, గణపతి, మధు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శెట్టిపాలెం, జెడ్‌.గంగవరం, బీమబోయినపాలెం, తామరం, రాచపల్లి తామరంతాటిపాలెం, తాడపాల పెద్దిపాలెం తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీవో సుధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అలాగే మొక్కలను వాటి పెంచే బాధ్యతలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్‌ అల్లురామునాయుడు, ఉపాధి పథకం పీవో కాశీ, సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం మండలంలోని మన్రిపాలెం గ్రామంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ కరక సత్యనారాయణ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ ముందుకు రావాలని కోరారు. అలాగే మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకున్నప్పుడే పర్యావరణ సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, ఉపాధి పథకం ఏపీవో కొండాజీ, మాజీ ఎంపీపీలు విజయకుమార్‌, పి.కొండబాబు, ఆర్‌.సత్యనారాయణ పైల సూరిబాబు, శెట్టి నానాజీ, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలోని బలిఘట్టం దర్శసాగరం రోడ్డు మొక్క నాటిన చింతకాయల పద్మావతి


మన్రిపాలెం గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటుతున్న తాండవ చైర్మన్‌ సత్యనారాయణ అధికారులు

వరి సాగుకు ముందు పచిరొట్ట విత్తనాలు వేయాలి

మాకవరపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరి సాగు ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చిరంజీవి సూచించారు. మండలంలోని వెంకన్నపాలెం, మల్లవరం గ్రామాల్లో గురువారం వికసిత్‌ కృషి సంకల్ప అభియాన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ ద్వారా వరి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. అలాగే వరిలో వెద పద్ధతిలో వరిసాగు చేపట్టడం ద్వారా దిగుబడులు పెరుగుతాయన్నారు. వరిలో విత్తనం విత్తే నుంచి కోత వరకు పూర్తిగా యంత్రాలతో చేసే విధానం రైతులకు అందుబాటులో ఉందన్నారు. అలాగే డ్రోన్‌ ద్వారా ఎరువులను పిచికారీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో చిరంజీవి

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

నాతవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెర్లోపాలెం గ్రామంలో వైసీపీ నాయకుడు మాకిరెడ్డి గణేశ్‌ ఆధ్వర్యంలో 15 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర వీరికి జనసేన కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, పవన్‌కల్యాణ్‌ ఆశయాలు నచ్చి ఇతర పార్టీల వారు జనసేనలో చేరుతున్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.


జనసేన కండువాలు కప్పుతున్న పార్టీ ఇన్‌చార్జి సూర్యచంద్ర

ఆస్తి పన్ను సర్వేను ఆపాలి

నర్సీపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను కోసం మునిసిపాలిటీలో నిర్వహిస్తున్న సర్వేను తక్షణమే ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్‌ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆస్తి విలువ ఆధారిత పన్ను వేయడానికి సర్వే చేస్తున్నారని, తక్షణమే ఈ విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అద్దె ప్రాతిపదికన ఆస్తి పన్ను నిర్ణయించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సాపిరెడ్డి నారాయణమూర్తి, ఇ.చిరంజీవి పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌ అథారిటీ సర్టిఫికెట్ల పంపిణీ

నర్సీపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్‌ అథారిటీ సౌజన్యంతో ఆరేపీ మార్షల్‌ ఆర్ట్స్‌ ఆధ్వర్యంలో ఉచిత వేసవి కరాటే శిక్షణ తరగతులలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. గురువారం ఆరేపీ మార్షల్‌ ఆర్ట్స్‌ అకాడమీ చైర్మన్‌ వెలగా నారాయణరావు పిల్లలకు వీటిని అందజేశారు. శిక్షణ తీసుకున్న పిల్లలకు దాతల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ కోచ్‌ ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

భోజన నిర్వాహకులకు శిక్షణ

మాకవరపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో డొక్కా సీతమ్మ భోజన పథకం నిర్వాహకులకు మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖాధికారులు జూన్‌ ప్రసాద్‌, మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఈ పథకం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం నిర్వాహకులకు వంటకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జి.వెంకటాపురం ప్రథమ స్థానం పొందగా, కొండల అగ్రహారం ద్వితీయ సాధించింది. బోయినపాలెం తృతీయ స్థానంలో నిలిచింది. అనంతరం వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం హైస్కూల్‌ హెచ్‌ఎం నారాయణరావు, తూటిపాల పాఠశాల హెచ్‌ఎం రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరు, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చీడికాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల మోడల్‌ కళాశాలలో ఈ ఏడాది ఆరో తరగతి, ఇంటర్‌, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్‌ చెరకాపు వెంకటలక్ష్మి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మిగిలిన సీట్ల భర్తీకి కమిషనర్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ వారు ఆన్‌లైన్‌లో ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. మెరిట్‌ కమ్‌ రోస్టర్‌ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక జరుగుతుందని, వివరాలకు 8179384669 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శివుని విగ్రహం ఆవిష్కరణ

మాడుగుల రూరల్‌: కింతలి వల్లాపురం శ్మశాన వాటిక వద్ద శివుని విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. పొంగలిపాకకు చెందిన పల్లికల రమణ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాయకులు కలవలపల్లి సోమన్నదొర, త్రినాథ్‌, ఆశోక్‌, నాయుడు, మోహన్‌, సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డుకు చోడవరం విద్యార్థిని ఎంపిక


అవార్డుకు ఎంపికైన నవ్యశ్రీని అభినందిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్‌, లెక్చరర్లు

చోడవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన ఇంటర్మీడియట్‌ పరీక్ష ఫలితాల్లో 988/1000 మార్కులు సాధించిన స్థానిక శ్రీవిజ్ఞాన్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థిని బుద్ధా నవ్యశ్రీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లాలో మొదటి స్థానంలో, రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచి ప్రతిభా అవార్డుకు ఎంపికైన నవ్యశ్రీని కళాశాల కరస్పాండెంట్‌ ఈర్లె గోవిందరావు, డైరెక్టర్లు బి.రామకృష్ణ, బీజీ దామోదర్‌, ప్రిన్సిపాల్‌ సహా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

వైభవంగా ముత్యమాంబ ఉత్సవాలు


ముత్యమాంబ వేడుకల్లో ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు తదితరులు

చోడవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజపతినగరంలో ముత్యమాంబ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగినస్థానిక ఎమ్మెల్యే కే ఎస్‌ ఎన్‌ ఎస్‌ రాజు అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ మహామండపంలో దేవతల ప్రతిష్ఠ కార్యక్రమానికి విశాఖ డెయిరీ డైరెక్టర్‌ పిళ్లా రమాకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, గవర కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గంగార్‌, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసెట్టి మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగోగాడలో శ్రీకనకమహాలక్ష్మి పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న బూడి, తదితరులు

చీడికాడ: పెదగోగాడలో కనకమహాలక్ష్మి పండగ వైభవంగాజరిగింది. అమ్మవారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.సర్పంచ్‌ పైల అప్పియ్యమ్మ, రెడ్డి రాము, రెడ్డి జయరామ్‌, రెడ్డి అనీల్‌కుమార్‌, టీడీపీ నాయకులు దర్శించుకున్నారు.

ఘనంగా గండి మారమ్మ పెద్ద పండగ

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేటలో గండి మారమ్మ పెద్ద పండగ గురువారం ఘనంగా జరిగింది. మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జలాశయ చైర్మన్‌ పోతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాడుగుల రూరల్‌: సత్యవరంలో రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సూర్యనారాయణ, కేశవ, అప్పారావు పాల్గొన్నారు.


రావికమతంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్‌.రాజు


చీడికాడ హైస్కూల్‌ గ్రౌండ్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

మొక్కల సంరక్షణతోనే ప్రాణవాయువు

- ▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్‌ రాజు
- ▸ ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

చోడవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్‌ రాజు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని పంచాయతీ పార్కు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎంపీడీవో అంజనేయులు, ఈవో నారాయణరావు, స్థానిక నాయకులు సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావుతో పాటు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అంబేరుపురం పంచాయతీలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్‌ డైరెక్టర్‌ బొడ్డేడ గంగార్‌, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, యువకులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. వెంకన్నపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ముదుకుటి రమణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉరుకుటి శ్రీనివాస్‌, కార్యదర్శి గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు. గోవాడ షుగర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎండీ వి. సన్యాసినాయుడు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జిల్లా జడ్జి

స్థానిక కోర్టు ప్రాంగణంలో అదనపు ప్రామిలీ కోర్టు జిల్లా జడ్జి పి. రాజారావు పాల్గొని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్‌సివిల్‌ జడ్జి జి. సర్ల, బార్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి చీపురుపల్లి రమణ, న్యాయవాదులు భవానీ శంకరం, డి. వెంకటరావు, పైడిరాజు, వారాధి రాజు, చందు, పీవీ రమణమూర్తి, సీఎ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో..

బుచ్చయ్యపేట: మనిషికి ప్రాణ వాయువును అందించే మొక్కలను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో నాటాలని ఎమ్మెల్యే కె.ఎస్‌.ఎన్‌.రాజు అన్నారు. మండలంలోని చిట్టిబిడి గ్రామంలో చెక్క సంపద కేంద్రం వద్ద ఎమ్మెల్యే రాజు మొక్కలు నాటారు. నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, బార్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి చీపురుపల్లి రమణ, దొండా అప్పారావు, యలంకాయల అప్పలనాయుడు, గోలాని శ్రీను, దొండా నరేశ్‌, సాయంశేమ, దొండా గిరి, గొన్నాబత్తుల శ్రీను, సర్పంచ్‌ పెదిరెడ్డి మాణిక్యం,ఎంపీపీ దాకవరపు నాగేశ్వర దేవి, తహసీల్దార్‌ లక్ష్మి, ఎంపీడీవో వి జయలక్ష్మి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఏపీవో వరహాలబాబు, ఏపీఎం రాజుబాబు తదితరులు పాల్గొన్నారు. వడ్డాది గ్రామంలో ధరిత్రి సంస్థ ఆవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్‌ రమ్య మాట్లాడుతూ ప్లాస్టిక్‌ కవర్లు నిషేధించాలని, మొక్కలు నాటాలని తెలిపారు. వైస్‌ ఎంపీపీ దొండా లలిత నారాయణ మూర్తి, సుంకర నానాజీ, ఆకుల నాగేశ్వరరావు, ఏపీఎం రాజుబాబు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు. వడ్డాదిలో టీడీపీ మండల అధ్యక్షులు దొండా నరేశ్‌ మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా కార్యదర్శి దూది రాజేశ్‌, తలారి శంకర్‌ పాల్గొన్నారు. కొండపాలెంలో సర్పంచ్‌ ముచ్చకర్ల భవానీ, పీఏసీఎస్‌ మాజీ అధ్యక్షుడు ముచ్చకర్ల తాతీలు మొక్కలునాటారు సీతయ్యపేటలో సర్పంచ్‌ వజ్రపు ఇందిరా శ్రీను, కార్యదర్శి దుక్కా సురేశ్‌, రాజుబాబు పాల్గొన్నారు.


చోడవరం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి రాజారావు

రావికమతం:ప్లాస్టిక్‌ వాడకానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ రాజు పిలుపునిచ్చారు.కొత్తకోట,టి.అర్జాపురం, గొర్లిం, రావికమతం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నియోజక వర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కోటనీలవేణి, కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, వెల్లంకి శ్రీను పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: ఎమ్మెల్యే కె.ఎస్‌.ఎన్‌.రాజు మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలను నాటారు. అడ్డసరిలో ఎ వెన్యూ ఫౌండేషన్‌ ద్వారా రోడ్డుకు ఇరువైపులా 200 మొక్కలను నాటారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుమలూరు చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యులు సుర్ల రామకృష్ణ, సర్పంచ్‌ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రత్యేక చట్టం అవసరం: ఎమ్మెల్యే బండారు

చీడికాడ: రాష్ట్రంలో పక్కా గృహాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణ సమయంలోనే మొక్కలు నాటి వాటిని ప్రత్యేకంగా పెంచే బాధ్యత తీసుకునేలా ప్రత్యేకంగా చట్టం అవసరమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక హైస్కూల్‌ ఆవరణలో పలు మొక్కలు ఎంపీపీ కురాకు జయమ్మ, స్థానిక సర్పంచ్‌ గాలి సాంబాలమ్మతో కలిసి గురువారం మొక్కలు నాటారు. అ నం తరం వరహాపురం, మంచాల గ్రామాల్లో ఇద్దరికి సీఎం సహాయ నిధి చెక్కులు ఎ మ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ పీవీ రవివర్మ మా ట్లాడుతూ, డివిజన్‌లో 8 వేల మొక్కలు నాటించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీ ల్దార్‌ కిషోర్‌లింకన్‌, ఎంపీడీవో హేమ సుందరరావు, డీఆర్‌వో జి.రాజగోపాలరావు, ఎంఈవోలు కె.బొంజు బాబు, బీవీ రమణ, హైస్కూల్‌ కమిటీ చైర్మన్‌ బొద్దు దుర్గారావు, టీడీపీ నాయకులు పోతల రమణమ్మ, కుచ్చు కణాపతి, గండి లక్ష్మి, పోతల చిన్నం నాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి: సర్పంచ్‌ బాబూరావు వి.కింతాడ పాఠశాలలో మొక్కలు నాటారు. కొప్పాక కాసుబాబు, కడింగొల్లేశ్వరరావు, కొమార బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణంతో అవసరమని వివిధ న్యాయ యూనివర్సిటీ పూర్వ వైస్‌ చాన్సలర్‌ డాక్టర్‌ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. గురువారం స్థానిక జూనియర్‌ కళాశాలలో మొక్కలు నాటారు. ఆయన్ను విద్యాసంస్థల అధినేత డాక్టర్‌ ఖాతిం, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారి సి.మూరి రమణ, గాడి అప్పారావు, ప్రిన్సిపాల్‌ సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.


వడ్డాదిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రమ్య

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు


ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శేషగిరిరావు

రోలుగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం శుచిగా, శుభ్రంగా భోజనాలను విద్యార్థులకు వడ్డించాలని హెచ్‌ఎం శేషగిరిరావు సూచించారు. గురువారం స్థానిక జడ్పీ పాఠశాలలో ఎండీఎం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌ 12న పాఠశాలలు పునః ప్రారంభం నేపథ్యంలో నిర్వాహకులు తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయాలన్నారు. విద్యార్థులతో ప్రేమతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జగ్గారావు, జాన్‌ ప్రసాద్‌, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

దేవరాపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం ఈదు రు గాలులు బీభత్సం సృష్టించాయి. స్థానిక జూనియర్‌ కళాశాల సమీపంలో చెట్టు పడడంతో విద్యుత్‌ స్తంభాలు నేల మట్టమయ్యాయి. దేవరాపల్లి-అనందపురం రోడ్డులో విద్యుత్‌ తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్‌.ఐ. మల్లేశ్వరరావు, సిబ్బందితో చేరుకుని రోడ్డుపైన పడిన చెట్లను తొలగించారు. నాగయ్యపేటలో తామరబ్బ తదితర గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

అంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


రాజులపాలెంలో ఆంజనేయ స్వామి దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజుపాలెంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. టీడీపీ మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, కరగాని నాగేశ్వరరావు, ముద్దా రామునాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ జిల్లా సంస్కృతిక బృందం ముచ్చకర్ల నాగేశ్వరరావు, పూడి రామారావు, వైస్సాసరావు, వరద సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం రోడ్లు ఛిద్రం

భారీ గోతులతో వాహనదారుల ఇక్కట్లు

» వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్న రహదారులు


వర్షం నీటితో కాలువను తలపిస్తున్న చీడికాడ రోడ్డు


చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బీఎన్ రోడ్డు మధ్యలో గొయ్యి


చోడవరం పట్టణంలో ఛిద్రమైన దేవరాపల్లి రోడ్డు


కొత్తూరు జంక్షన్ వద్ద రోడ్డు మొత్తం ఛిద్రమైన దృశ్యం

చోడవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో అంతర్గత రహదారులు అధ్వానంగా వున్నాయి. నియోజకవర్గానికి ప్రధాన రహదారి అయిన బీఎన్ రోడ్డు ఇప్పటికే పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులు నానాపాట్లు పడుతున్న విషయం తెలిసిందే. తామేమైనా తక్కువా అన్నట్టు.. చోడవరం పట్టణంలోని రోడ్లతోపాటు ఇతర మండలాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. బీఎన్ రోడ్డులో చోడవరంలోని కొత్తూరు జంక్షన్ వద్ద భారీ గొయ్యి ఏర్పడి, వర్షం కురిస్తే నీరు నిలిచి చెరువును తలపిస్తున్నది. కొత్తూరు జంక్షన్ నుంచి దేవరాపల్లి వెళ్లే రహదారి పలుచోట్ల గోతులమయంగా మారింది. కొత్తూరు జంక్షన్ నుంచి అన్నవరం గ్రామం వరకు రహదారి ఆనవాళ్లు లేదు. పట్టణంలో నుంచి లక్ష్మీపురం వెళ్లే రహదారిలో కో ఆపరేటివ్ కాలనీ బ్యాంకు వద్ద, బాలాజీనగర్, మహతీ స్కూల్, ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో మురుగు నీటితోపాటు వర్షం నీరు రోడ్లపై పారుతుండడంతో రహదారి దెబ్బతింటున్నది. చోడవరం నుంచి చీడికాడ వెళ్లే రోడ్డులో ఐటీఐ కాలనీ వద్ద రహదారి పాడైపోయింది. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే వర్షా కాలంలో రహదారులు మరింత దారుణంగా తయారవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి

» ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ


ఐటీడీఏ ఆవరణలో మొక్క నాటుతున్న ఇన్‌ఛార్జి పీవో అభిషేక్‌గౌడ

పాడేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే. అభిషేక్‌గౌడ పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యా వరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో, విద్యాలయాల్లో, అంగన్‌వాడీల కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. అడవులను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని, ఏజెన్సీని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్ది ప్రకృతి రక్షణకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని, పరిపాలనాధికారి ఎం.హేమలత, అకౌంట్స్ అధికారి శ్రీనివాస కుమార్, మేనేజర్ పరంజ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, ఐటీడీఏలోని వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ఉత్పత్తిని గురువారం పునరుద్ధరించారు. ఈ యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో మంగళవారం తెల్లవారుజామున ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో అన్ని యూనిట్‌ల్లోనూ ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

పాలిథిన్ ప్రమాదకరం

» కలెక్టర్ విజయకృష్ణన్
» ఘనంగా పర్యావరణ దినోత్సవం


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, పక్కన రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్ తదితరులు

నక్కపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, పాలిథిన్ వాడడం చాలా ప్రమాదకరమని, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మండలంలోని పెదబోదిగల్లం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మార్కెట్లకు వెళ్లినప్పుడు చేతి సంచి, లేదా నూలుతో తయారు చేసిన బ్యాగులు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్‌లను పెదబోదిగల్లం సర్పంచ్ మున్నీషా బేగం, ముస్లిం మత పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో లక్ష్మణ్, సబ్‌డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సునీల్ కుమార్, రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్, నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఎస్.రాయవరం మండలం టీడీపీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, ఆర్డీవో వీవీవీ రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెదబోదిగల్లం వద్ద కారిడార్ నిర్వాసిత రైతులకు కేటాయించిన లేఅవుట్ల వద్ద కలెక్టర్ విజయకృష్ణన్, యువరాజ్, డీఎఫ్‌వో లక్ష్మణ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, కూటమి నాయకులు వెలగా శ్రీను, వైబోయిన రమణ, వెలగా సుధాకర్, గుర్రం రామకృష్ణకోసూరి శ్రీను, దార్ల కృష్ణ, పెదపూడి శంకరరావు తదితరులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

82 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం

» జిల్లా అటవీశాఖాధికారి జి.లక్ష్మణ్

నక్కపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో అనకాపల్లి జిల్లాలో 82 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా అటవీ శాఖాధికారి జి.లక్ష్మణ్ చెప్పారు. గురువారం నక్కపల్లి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2047 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో అటవీ భూముల శాతం పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 90 నర్సరీలు ఏర్పాటు చేసి, పంపిణీకి మొక్కలను సిద్ధంగా వుంచామన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పేపర్ మిల్స్, ఉద్యానవనశాఖ, డ్వామా, అటవీశాఖల సమన్వయంతో మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నాటే మొక్కల్లో సరుగుడికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇది తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక లాభాలనిస్తుందన్నారు. దాదాపు 70 లక్షల మొక్కలు సరుగుడు నాటుతామని, మిగిలిన 12 లక్షల మొక్కలు పలు రకాల జాతులుంటాయని చెప్పారు. రైతుల పొలాల్లో కూడా సరుగుడు పెంచుకోవడానికి ఉచితంగా నారు ఇస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి, చోడవవరం రేంజ్ కార్యాలయాల పరిధిలో మొక్కల పెంపకంపై మానిటరింగ్ చేస్తామని చెప్పారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

... 5వ పేజీ తరువాయి

పజీలా బాను (అనకాపల్లి), ఉడతపల్లి ప్రణతి (బలిఘట్టం), చలుగు మౌనిక (కొక్కిరాపల్లి), వి.మానస (కోనాం), కొడమంచిలి చంద్రిక (అనకాపల్లి), గరగ పుష్పలత (మునగపాక), షేక్ లతీఫ్ ఉన్నీసా (తానాం), వడ్డాది నందిని (అనకాపల్లి), కొర్రా జాహ్నవి (నర్సీపట్నం), కలిమి హారిక (కొత్తకోట), బద్నాయక్ హేమకుమార్ (సబ్బవరం), బేతా మౌనిక (తానాం), పూడి అనురాధ (అనకాపల్లి), సారికి జశ్వంత్ (సబ్బవరం), పాలెపు సుప్రియ (అచ్యుతాపురం మండలం భోగాపురం), అవుగడ్డి హర్షిత (నామవరం, పాయకరావుపేట మండలం), పూసర్ల లలితాదేవి (అనకాపల్లి), పులగాల మహిమజ్యోతి (బలిఘట్టం), షేక్ రిజ్వాన్ పర్వీన్ (అనకాపల్లి), మార్తి ఉషారాణి (నామవరం-పాయకరావుపేట), కవడ లోహిత్‌వర్ధన్ (అనకాపల్లి), వాసుపారి జోయాసి (తాళ్లపాలెం), సిరపల్లి హరిత (నర్సీపట్నం), నక్కరాజు రోహిణి (నర్సీపట్నం), షేక్ ఖరున్నీసా (అనకాపల్లి), కపారపు అపర్ణ (గొలుగొండ), రావుల జర్మియా మౌలీకిరణ్ (నర్సీపట్నం), రావాడ దాక్షాయిని (నామవరం-పాయకరావుపేట), గుంటపల్లి గంగాధర్ (నామవరం-పాయకరావుపేట), గొలగాన శ్రీను (కొత్తకోట).

విశాఖకు 'సత్వా'?

» హిల్ నంబరు 4పై 25 ఎకరాలు కేటాయించే అవకాశం
» భారీ భవనాలను నిర్మించి ఐటీ సంస్థలకు అందించనున్న కంపెనీ
» 10న సిరిపురంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) విశాఖపట్నానికి మరో పెద్ద కంపెనీ రానుంది. ఇది రహేజా వంటి సంస్థల్లా భారీ భవనాలు నిర్మించి ఐటీ సంస్థలకు అందిస్తుంది. దీని పేరు 'సత్వా'. దేశంలో పెద్ద సంస్థల్లో ఒకటిగా పేరు ఉంది. విశాఖపట్నంలో కో వర్కింగ్ స్పేస్ భవనాలు నిర్మించడానికి ఆసక్తి చూపుతోంది. భూమి కేటాయిస్తే భవనాలు నిర్మిస్తామని ప్రతిపాదించింది. అన్నీ పరిశీలించిన కమిటీ కేబినెట్ ముందు పెట్టనుంది. మధురవాడ హిల్ నంబర్ 4పై (అదానీకి కేటాయించిన కొండ) 25 ఎకరాలు కేటాయించే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలిసింది.2

10న టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన ఐకానిక్ భవనం 'ది డెక్'లో ఒక అంతస్తు టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం అందులో ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయి. ఆ హబ్‌ను సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పదో తేదీన ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ నిర్మించిన యుహెచ్-3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం కూడా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల పదో తేదీన గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం వస్తున్నారు. ప్రొటోకాల్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా హాజరవుతున్నారు.

పాము కాటు బాధితుడికి తప్పని డోలీ మోత

» గ్రామానికి రహదారి సౌకర్యం లేక ఏడు కిలోమీటర్లు మోసుకెళ్లాల్సిన దుస్థితి


పాము కాటుకు గురైన యువకుడిని డోలీలో తరలిస్తున్న దృశ్యం.

జి.మాడుగుల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాల పంచాయతీ మారుమూల తలబరిసింగి గ్రామానికి చెందిన డిప్పల బుజ్జిబాబు ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున కట్లపాము కాటేసింది. దీంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో కుటుంబ సభ్యులు డోలీ కట్టి కొండలు, గుట్టలు దాటుకుంటూ వంతాల వరకు సుమారుగా ఏడు కిలోమీటర్లు మోసుకెళ్లారు. అక్కడ నుంచి అతనిని 108 వాహనంలో జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందించి మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

సీలేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం- పాడేరు ఎక్స్‌ప్రెస్ బస్సు అదుపుతప్పి ఒడియా క్యాంప్ వద్ద 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం 10 గంటలకు భద్రాచలం నుంచి 30 మంది ప్రయాణికులతో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు పాడేరు వెళుతున్నది. ఒడియా క్యాంప్ వద్దకు వచ్చే సరికి బస్సు అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. అయితే అప్పటికే డొంకరాయి ఏపీజెన్‌కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి నిర్వహణ పనులు చేపడుతున్నారు. దీంతో విద్యుత్ స్తంభానికి బస్సు బలంగా ఢీకొన్నా ఎవరు విద్యుదాఘాతానికి గురికాలేదు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

క్రైం... crime news

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


షేక్ అభిషేక్ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెందిన ఒక యువకుడు ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్టు గురువారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక విజయరామరాజుపేటకు చెందిన షేక్ మహబూబ్, షకీనా దంపతుల కుమారుడు షేక్ అభిషేక్(18) ఇంటర్మీడియట్ చదివాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆలస్యంగా తిరిగి వచ్చాడు. ఇంత ఆలస్యంగా ఇంటికి వచ్చావేమిటని తల్లిదండ్రులు ప్రశ్నించారు. దీనికి మనస్తాపం చెందిన అభిషేక్ ఇంట్లోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ సంఘటనపై తల్లి షకీనా గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నర్సీపట్నంలో కారు దహనం


ఫోమ్‌తో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సీపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని శారదా నగర్ మొదటి లైన్‌లో నివాసం ఉంటున్న ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరి బి.ఈశ్వరరావు కారుని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బుధవారం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఈ సంఘటన చేసుకుంది. ఈశ్వరరావు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఆ ప్రాంతంలో వున్న సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. కారుని దహనం చేసిన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పారిశ్రామిక ప్రగతికి బాటలు

... 5వ పేజీ తరువాయి

ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కానున్నది. ఇందు కోసం 50 ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేశారు. ఎలమంచిలి నియోజకవర్గం పరిధిలోని ప్రత్యేక ఆర్థిక మండలిలో పూడిమడక సమీపంలో 124 ఎకరాలు కేటాయించారు. చోడవరం నియోజకవర్గ పరిధిలోని చోడవరం మండలం దుడ్డుపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కును 100 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం కింతాడ, గరుగుపాలెం గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి కోసం 50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి డీపీఆర్‌లను జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు స్వీకరిస్తున్నారు. తగిన అర్హతలు వుంటే ఎంఎస్ఎంఈ పార్కుల్లో స్థలాలు కేటాయిస్తారు.

యువతకు మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. స్థానికంగా ఉండే వనరులను సద్వినియోగం చేసుకొని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగే అవకాశం ఎంఎస్ఎంఈల ద్వారా సాధ్యపడుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే అమలు చేస్తుండడంతో నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షయ రహిత సమాజం దిశగా..

... 5వ పేజీ తరువాయి

వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తారు. జిల్లాలో ఉన్న 27 ఆర్టీపీసీఆర్ కేంద్రాలలో కఫం పరీక్షలు చేస్తున్నారు. రెండు వారాలకుపైగా దగ్గు తగ్గక పోవడం, రాత్రి సమయంలో జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, దగ్గినప్పుడు కఫంలో రక్తం పడడం వంటి క్షయ లక్షణాలు అని నర్సీపట్నం క్షయ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి తెలిపారు. వంద రోజుల్లో క్షయ స్క్రీనింగ్, కఫం, ఇతర పరీక్షలు పూర్తి చేసి, అవసరమైన వారికి చికిత్స అందిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి తెలిపారు. క్షయ వ్యాధిని నిర్మూలించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆమె చెప్పారు.

వాణిజ్య సరళిలో మునగ సాగు

... 5వ పేజీ తరువాయి

చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మునగ సాగు కోసం పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలో గొలుగొండ, బుచ్చెయ్యపేట మండలాలను ఎంపిక చేసింది. తొలుత ఒక్కో మండలంలో వంద ఎకరాల్లో మునగ సాగు


ఎండిన మునగ ఆకు


మునగాకు పొడి

చేపడతారు. ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తారు. ఇందులో భాగంగా డ్వామా అధికారులు ఆ రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో డ్వాక్రా సభ్యులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా సమీకృత సాగుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాధారణంగా మునగ కాయల కోసం తోటలను పెంచుతుంటారు. మొక్కల మధ్య, వరుసల మధ్య 10-12 అడుగుల దూరం వుండేలా మొక్కలు నాటుతారు. కానీ ఆకుల కోసమే సాగు చేస్తుండడంతో మొక్కల మధ్య, వరుసల మధ్య రెండు అడుగుల దూరం మాత్రమే వుంటుంది. అందవల్ల ఎకరాకు 5,300 విత్తనాలు నాటుతారు. విత్తిన 90 రోజులకు మొదటి విడద ఆకు కోతకు వస్తుంది. సాగుదారులైన డ్వాక్రా మహిళలు తోటల్లో ఆకులు కోసి, ఎండబెట్టి, ప్యాకింగ్ చేయాలి. ఎండిన మునగ ఆకు కిలో రూ.250కి కొనుగోలు చేసేలా తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒక కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. మునగ విత్తనాలను కూడా ఈ కంపెనీయే సరఫరా చేస్తుంది. విత్తనం ఖర్చుతోపాటు పొలంలో నాటడానికి, ఇతర పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో మునగ సాగు చేసే ఏటా రూ.5-7 లక్షల వరకు ఆదాయం వస్తుందని డ్వామా సిబ్బంది చెబుతున్నారు. మునగ తోటల సాగుకు ఆసక్తి ఉన్న డ్వాక్రా సంఘాలు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం కరుణానిధి తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539